క్లుప్తంగా

పీఎంశ్రీతో మరింత విజ్ఞానం



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీటీఆర్‌ఐ డైరెక్టర్ శేషుమాధవ్

పెద్దాపురం: నవోదయ విద్యాలయలో విద్యార్థులకు మరింత విజ్ఞానం అందించేందుకు పీఎంశ్రీ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని సీటీఆర్‌ఐ సెంటర్ ఫర్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూషన్ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. మంగళవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ ఆర్.కమలం అధ్యక్షతన నిర్వహించిన పీఎంశ్రీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శేషు మాధవ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక ప్రతిభను వెలికితీసేలా శిక్షణ ఇవ్వడమే పీఎంశ్రీ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, శ్రీనివాస్, కేశవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి



పట్టుకున్న నిందితుడితో పోలీసులు

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని పొలాల్లో సారా బట్టీపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో సారా బట్టీపై దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడిలో ఎస్‌ఐ మౌనిక, వీఆర్వో మురళి, కానిస్టేబుల్ శివలు పాల్గొన్నారు.

షాపుల ద్వారా రూ.10.37 లక్షల ఆదాయం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం వద్ద ఏర్పాటుచేసిన నాలుగు షాపుల ద్వారా ఏడాదికి రూ.10.37 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆలయం వద్ద షాపులు ఏర్పాటు చేసుకోవడానికి మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. హోటల్ ఏర్పాటుకు గతేడాది రూ.3.73 లక్షలు రాగా ఈ ఏడాది రూ.4.10 లక్షలు వచ్చిందన్నారు. చెప్పుల షాపుకు గతేడాది రూ.1.05 లక్షలొస్తే ఈ ఏడాది రూ.1.40 లక్షలు, ఆవు నెయ్యి అమ్మకం షాపుకు గతేడాది రూ.2.06 లక్షలొస్తే ఈ ఏడాది రూ.2.82 లక్షలు, డ్రైఫ్రూట్స్ షాపుకు గతేడాది రూ.1.03 లక్షలొస్తే ఈ సంవత్సరం రూ.1.05 లక్షలు వచ్చాయన్నారు. అయితే పూజా సామగ్రి, సైకిల్ పార్కింగ్, కొబ్బరి చిప్పలకు సంబంధించిన వేలం వాయిదా పడిందన్నారు.

పింఛన్ అందుకుంటూ.. సంబరాలు చేసుకుంటూ..



సామర్లకోటలో లోవరత్నంకు పింఛన్ అందజేస్తున్న కౌన్సిలర్ వీరభద్రరావు

సామర్లకోట: కొత్త సంవత్సరంలో నూతన పింఛన్లు మంజూరు కావడంతో పాటు పింఛను మొత్తం పెరిగి రూ.3 వేలు కావడంతో లబ్ధిదారులు సంబరాలు జరుపుకుంటున్నారు. స్థానిక 14వ వార్డులో కౌన్సిలర్ స్వయంభూపు వీరభద్రరావు, సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి జోగారావులు మంగళవారం సలాది చెల్లాయమ్మ, మామిడి లోవరత్నాలకు కొత్త పింఛన్లు అందజేశారు. మున్సిపాలిటీలో కొత్తగా 107 పింఛన్లు మంజూరయ్యాయని, ఈ నెల 10వ తేదీ వరకూ పింఛన్ల పంపిణీ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు.

మోకాళ్లపై నిరసన

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన శిబిరంలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు మంగళవారం మోకాళ్లపై నిరసన తెలిపారు. పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, ఎలిశెట్టి రామదాసు, కామిరెడ్డి బొడకొండ, బచ్చా శ్రీను, కసింకోట ఆనందరావు, గూడుపు అనిత, బంగారు కొండ, గౌరంశెట్టి రమణమ్మ పాల్గొన్నారు.

దత్తాత్రేయునిగా సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు దత్తాత్రేయునిగా భక్తులను దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

చెరకు చేదవుతోంది

- తగ్గుముఖం పట్టిన సాగు విస్తీర్ణం
- కేవలం బెల్లం తయారీకే పంట పరిమితం
- చక్కెర కర్మాగారాల మూసివేతే ప్రధాన కారణం



పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లిలో చెరకు పంట



బెల్లం తయారుచేస్తున్న కార్మికుడు

పెద్దాపురం: చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. గతంలో పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో సామర్లకోట, పెద్దాపురం అర్బన్ ప్రాంతాలతో పాటు మూడు మండలాల్లో అత్యధికంగా 8,358 ఎకరాల్లో సాగయ్యేది. షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు చెరకు విత్తనాన్ని తక్కువ ధరకే ఇవ్వడమే కాకుండా పంటను కూడా వారే పొలాల వద్దకు వచ్చి కొనేవారు. దీంతో ఎక్కువ మంది రైతులు చెరకు సాగుకు పోటీ పడేవారు. అయితే పంచదారకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేక ఫ్యాక్టరీల మూతతో చెరకు సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో రైతులు ప్రధానంగా బెల్లం తయారీ కోసమే చెరకును పండిస్తున్నారు. ప్రస్తుతం బెల్లం తయారీ కోసం నియోజకవర్గంలోని ఒక్క పెద్దాపురం మండలంలోనే తాటిపర్తి, మర్లావ, దివిలి, తిరుపతి, చంద్రమాంపల్లి గ్రామాల్లో చెరకు సాగు చేస్తున్నారు.

సాగు కాలం ఎక్కువ

చెరకు పంట కాలం పది నెలలు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి చెరకుకు ఉంది. మధ్యలో ఒడిదొడుకులున్నా చెరకు లాభదాయకంగా ఉండేదని రైతులు చెబుతున్నారు. కొలు ధర కూడా గిట్టుబాటు అయ్యేది. సాగు ప్రారంభం నుంచీ విత్తనం కోసం చెరకు నరకడం, విత్తనం నాటడం, ఎరువులు వేయడం, కలుపు తీత, జడలు అల్లడం, ఎరువు వేసిన తర్వాత కాలువలు తవ్వడం, పురుగు మందులు చల్లడం, చెరకు తోట నరకడం, ఫ్యాక్టరీలకు లోడింగ్ వేయడం.. ఇన్ని పనులు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటికీ ఎకరాకు సుమారు 150 నుంచి 200 మంది కూలీలకు ఏడాది పొడవునా పనులుండేవి.

ఫ్యాక్టరీల మూసివేతే ప్రధాన కారణం

చెరకు పండించే రైతులను చక్కెర కర్మాగారాలు ఆదుకునేవి. రైతు చెరకు సాగు మొదలు పెట్టిన దగ్గర నుంచి విత్తనం సరఫరా చేయడం, ఎరువులు, పురుగుమందులు, గడ్డి మందులు ఇచ్చేవి. ఇవి కాకుండా చెరకును కొనుగోలు చేసిన తర్వాత టన్ను చెరకుకు కొనుగోలు పన్ను రూ.10 నుంచి రూ.60 వరకూ కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి నేరుగా రైతులకు చెల్లించేవారు. పెద్దాపురం నియోజకవర్గంలో చెరకు రైతుల నుంచి నవభారత్ షుగర్స్ (సామర్లకోట) కర్మాగారం రోజుకు పది నుంచి పదిహేను లక్షల టన్నుల వరకూ చెరకును కొనుగోలు చేసేది. పదేళ్ళ క్రితం పిఠాపురం, నాలుగేళ్ళ క్రితం చెల్లూరు, మూడేళ్ళ క్రితం సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ప్రధానంగా సామర్లకోట నవభారత్(షుగర్స్) ఫ్యాక్టరీ మూతపడడంతో పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, రాజానగరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో రైతులు వరి, ఆరుతడి పంటల వైపు దృష్టి సారించారు. చెరకు పంట ఒకసారి చేతికి అందేలోపు తక్కువ సమయంలో రెండు సార్లు వరి, ఆరుతడి పంటలు దిగుబడులు అందిపుచ్చుకోవడంతో రైతులు రానురానూ చెరకు సాగు తగ్గించేశారు.

చక్కెర పరిశ్రమను తెరిపించాలి



ఎన్నో వేల కుటుంబాలకు జీవనోపాధిని కల్పించే చెరకు సాగు పెద్ద పరిశ్రమ. ఈ పరిశ్రమ దెబ్బతినడం వల్ల ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులు కల్పించాల్సి వచ్చింది.చెరకు సాగుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలి. చక్కెర పరిశ్రమలను తెరిపించి చెరకు సాగును ప్రోత్సహించాలి.

– నల్లల గోవిందు, రైతు, కట్టమూరు, పెద్దాపురం మండలం

ఆరుతడి పంటలపైనే రైతుల దృష్టి



చెరకు పంటపై రైతులకు ఆసక్తి తగ్గిన మాట వాస్తవమే. సాగు నీరు పుష్కలంగా అందుబాటులో ఉన్న చోట మాత్రమే బెల్లం తయారీకి ఈ పంటను సాగుచేస్తున్నారు. పెట్టుబడులు కూడా పెరిగిపోయాయి. చెరకు ఒక పంటకు అయ్యే ఖర్చుతో ఆరుతడి పంటలు రెండు దఫాలు పండించవచ్చు. దీంతో అధిక శాతం రైతులు వరి, ఆరుతడి పంటలను ఎంచుకుంటున్నారు.

– దైవకుమార్, ఏడీఏ, పెద్దాపురం

ప్రజలందరికీ జగనన్న సురక్ష



రోగులకు మందులను అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రత్నకుమార్ అన్నారు. మండలంలోని మూలపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వందశాతం వ్యాధి నిరోధక టీకాల లక్ష్యంగా సాధించాలని, గర్భిణులను మొదటి మూడు నెలల లోపు గుర్తించి వారిని రిజిస్ట్రేషన్ చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా, ప్రభుత్వ ఆస్పత్రులలో అందించే సేవలను తెలియపరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బొబ్బరాడ



మండల సమావేశంలో ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు సూరిబాబు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నాడు–నేడు పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ సత్తిబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సత్యవరపుపేటలో పనులు నత్తనడకన జరుగుతున్నాయని, పాఠశాలలోని పాత మరుగుదొడ్లు కూల్చి వేయడం వల్ల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు శివకోట శివరామకృష్ణ అన్నారు. ఎంపీపీ కలగజేసుకొని పనులు వెంటనే పూర్తయ్యేలా చూడాలంటూ ఎంపీఓ శివరామకృష్ణయ్యను ఆదేశించారు. హెల్త్ ఎంఎల్‌పీలు లేకపోవడం వల్ల పీబీ దేవం గ్రామంలో రెండు హెల్త్ సెంటర్లు ఖాళీగా ఉంటున్నాయని ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమించాలని వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి శ్రీహిమవతికి చెప్పారు. తమ గ్రామంలో హౌసింగ్ సిబ్బంది పనితీరుపై ఎంపీటీసీ సూరిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. 100 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని, అప్పుడే మౌలిక సదుపాయాల కల్పనకు అవకాశం ఉంటుందని ఎంపీపీ తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు మంజూరయ్యేలా చూడాలని మండల వ్యవసాయాధికారి ఐ.సత్యకు సూచించారు. మండల పరిధిలో కుక్కకాటు కేసులు ఎక్కువగా వస్తున్నాయని, కోవిడ్ సీరియస్ కేసులు లేవని వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టరు శ్రీహిమవతి తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ మోహిద్దీన్, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ట్రాన్స్‌కో ఏఈ బి.కృష్ణ, వేట్లపాలెం పశువైద్యాధికారి సీహెచ్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య అందించడమే లక్ష్యం



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ సత్తిబాబు తదితరులు

సామర్లకోట: విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ట్యాబ్‌లను అందిస్తుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. మంగళవారం వీకే రాయపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధనవంతుల పిల్లలతో సమానంగా పేదల పిల్లలు సైతం ఇంగ్లిష్‌లో మాట్లాడేలా చేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే టీడీపీ నాయకులు కోర్టులను ఆశ్రయించారంటూ ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, విద్యా కమిటీ చైర్మన్ వెలమర్తి శ్రీనివాస్, హెచ్ఎం ఎ.నారాయణ రావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్ చౌదరి, వెలమర్తి బుల్లిరాజు, ఇంటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

క్లెయిముల సత్వర పరిష్కారానికి చర్యలు

ఆర్డీవో జేవీఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జేవీఎస్ రామారావు

పెద్దాపురం: నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లెయిముల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేవీఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో మంగళవారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జేవీఎస్ రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీసర్వే కార్యక్రమం మరింత వేగవంతం చేశామన్నారు. ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. ఓటరు జాబితాపై అపోహలు తొలగించడానికి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ఇప్పటి వరకూ 279 ఫారం–6, 120 ఫారం–7, 539 ఫారం –8 దరఖాస్తులు అందాయన్నారు. సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ(టీడీపీ), నీలపాల సూరిబాబు(సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్ష



ధర్నా చేస్తున్న రైల్వే ఉద్యోగులు

సామర్లకోట: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్ష చేశారు. రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటుచేసిన నిరాహార దీక్షల శిబిరాన్ని ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి, రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం కారణంగా పదవీ విరమణ తరువాత రైల్వే ఉద్యోగుల జీవనం కష్టంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ టి.ఈశ్వరరావు, డివిజన్ విశ్రాంత ఉద్యోగుల కార్యదర్శి కేవీపీ రావు, రామకృష్ణ, త్రినాథరావు, ప్రసాద్, రెడ్డి, నాయక్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని ప్రతిబింబించేదే నాటకం



నాటక కళా పరిషత్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: జీవితాన్ని ప్రతిబింబించేదే నాటకమని, ఆ నాటకానికి ప్రతిస్పందించేదే జీవికమని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లిలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కళా పరిషత్ నాటక పోటీల ఆహ్వాన పత్రికను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ మన ప్రాచీన సజీవమైన కళ నాటకమని, ఆ నాటక రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ కళాకారుడిపై ఉందన్నారు. కళలు మానసిక ఉల్లాసం కోసమే కాదని, జన జాగృతికి అవి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేశి రాజా, కమిటీ సభ్యులు కేదారి నాగు, వెన్నా పండు, నూకలమంతి నానాజీ, మంతెన సత్తిబాబు, దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛను అందజేత



బెంగుళూరులోని రామయ్యమ్మకు పింఛను అందజేసిన వలంటీరు రాజు

సామర్లకోట: స్థానిక 15వ సచివాలయానికి చెందిన వృద్ధాప్య పింఛను లబ్ధిదారు వీర్ల రామయ్యమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో మనవడి వద్దకు వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు. దాంతో మూడు నెలలుగా ఆమె బెంగుళూరులోనే ఉంటున్నారు. వరుసగా మూడు నెలల పాటు పింఛను తీసుకోక పోతే ఆ పథకం రద్దయ్యే అవకాశం ఉంది. దాంతో వలంటీరు దూళ్లపల్లి రాజు బెంగుళూరు వెళ్లి లబ్ధిదారుకు పింఛను సొమ్ము రూ.మూడు వేలు అందజేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీర్రాఘవరావు తదితరులు



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పెద్దాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. ఈ నెల 19వ తేదీన విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని మండలంలోని వడ్లమూరులో మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లా రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి కళ, వెంకన్నబాబు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సామర్లకోట: ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ లక్ష్మి, పి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు

కొత్తపల్లి: వాకతిప్ప గ్రామ సచివాలయం వద్ద మంగళవారం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో 125 అడుగుల విగ్రహాన్ని ఈ నెల 19న ఆవిష్కరించనున్నారని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కరు ఆశయాలను ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, వాకతిప్ప, కుతుకుడుమిల్లి సర్పంచ్‌లు పాలాని దొరబాబు, కర్రి చిన్నారావు, ఎంపీటీసీ రాయుడు విష్ణు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర ప్రణాళికా లక్ష్యాలు సాధించాలి

- జెడ్పీ సీఈఓ రమణారెడ్డి
- జిల్లాస్థాయి అధికారులకు శిక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న మండల, పంచాయతీ అధికారులతో జెడ్పీ సీఈవో రమణారెడ్డి

కాకినాడ సిటీ: జిల్లాలో గల లైన్ డిపార్టుమెంట్ జిల్లా అధికారులకు గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించి సుస్థిర ప్రణాళికా లక్ష్యాల రూపకల్పనపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మండలాల్లో బ్లాక్ లెవెల్ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, ప్రతి గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 9 అంశాలలో ఏదైనా అంశంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించేందుకు అధికారులు ప్రయత్నాలు చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో లక్ష్యసాధనకు ప్రతి ఒక్క అధికారి సంకల్పం తీసుకోవాలని సీఈవో కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా, రంపచోడవరం డివిజన్ పరిధిలోని మండల అభివృద్ధి అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీవో కె.భారతీ సౌజన్య, సామర్లకోట విస్తర్ణ శిక్షణాకేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

ఇది చేతల ప్రభుత్వం



వాకతిప్పలో పింఛను పంపిణీ చేస్తున్న సుదర్శన్ తదితరులు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వంలా మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని వాకతిప్పలో మంజూరైన కొత్తపింఛన్లు, ప్రభుత్వం పెంచి ఇచ్చిన పింఛన్లను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. గతంలో లబ్ధిదారులు పంచాయతీల వద్ద పింఛన్ల సొమ్ము కోసం పడిగాపులు కాయవలసి వచ్చేదన్నారు. ఈ ప్రభుత్వంలో అటువంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుడికి నేరుగా పింఛన్లను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజును రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ ఆయన చాంబర్ మర్యాద పూర్వకంగా కలిసారు. ఎస్సీ ఎస్టీ బ్లాక్‌లాగ్, అలాగే విద్యా విధానం తదితర విషయాలపై చర్చించారు. గిరిజన సమస్యలపై అధ్యయనం చేయడంతో పాటు వారి సమస్యలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి వివరించి పరిష్కారించేందుకు తాను పర్యటిస్తున్నానన్నారు. తనపై నమ్మకంతో సభ్యునిగా నియమించిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు కలిగాయన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్‌ను సత్కరించారు. ఆయన వెంట ఫుడ్‌టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి విజయశాంతి ఉన్నారు. అనంతరం వర్సిటీ అతిథి గృహంలో గిరిజన సంక్షేమ శాఖాధికారులతో సమావేశమై హాస్టళ్లు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు తదితర వాటిపై సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు చెందిన పలువురు ఆయా ప్రాంతంలో ఉన్న సమస్యలు వివరించి పర్యటించాలని కోరారు.

నేటి నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని 15 సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ముగియడంతో బుధవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

విజయవంతం చేయాలి..

మండల స్థాయిలో బుధవారం నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, అచ్చంపేట గ్రామంలోను ఆటల పోటీలు జరుగుతాయని ఆమె తెలిపారు.

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం కానునట్లు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు. ఈ పోటీలను ఎంపీపీ కారే సుధ, వైస్ ఎంపీపీలు చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మాదిరెడ్డి దొరబాబు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ ప్రారంభిస్తారన్నారు. ప్రారంభానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.